తెలంగాణ జాగృతి కార్యాలయంలో యూపీఎఫ్ కార్యవర్గాన్ని ప్రకటిస్తున్న కవిత

ఆ టెండర్లు రద్దు చేయాలి

- 9 వార్డులకు ఒకే టెండరా..?
- ప్రభుత్వ తీరుతో స్థానిక కాంట్రాక్టర్లకు నష్టం
- జీహెచ్ఎంసీపై ఏటా రూ.5.85 కోట్ల భారం
- మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్స్, ఇన్‌స్టంట్ రిపేర్ టీమ్స్ టెండర్లపై సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ కవిత లేఖ

హైదరాబాద్, జూన్1 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీలో మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్స్, ఇన్‌స్టంట్ రిపేర్ టీమ్స్ టెండర్లను వెంటనే రద్దు చేయాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కి ఆదివారం లేఖ రాశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వర్షాకాలంలో చేపట్టాల్సిన ఎమర్జెన్సీ పనుల టెండర్లలో కొందరు అధికారులు తమకు అనుకూలంగా ఉన్న సంస్థలకు లాభం చేకూర్చేందుకు ప్రయత్నిస్తున్నట్టుగా వార్తలు వస్తున్నాయని, తెలంగాణ బీసీ కాంట్రాక్టర్లకు నష్టం చేసేలా జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు వ్యవహరిస్తున్నారని కవిత ఆ లేఖలో ఆరోపించారు. ఒక విదేశీ సంస్థకు చెందిన వాహనాలను మాత్రమే ఈ పనుల కోసం వినియోగించేలా నిబంధనలు రూపొందించారని, కానీ ఆ సంస్థకు హైదరాబాద్‌లో రెండు షోరూమ్‌లు మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. ఆ షోరూమ్‌ల నిర్వాహకులు తెలంగాణ కాంట్రాక్టర్లతో ఎంవోయూ చేసుకునేందుకు ససేమిరా అంటున్నారని తెలిపారు. జీహెచ్ఎంసీలోని 150 వార్డులకు వేర్వేరుగా టెండర్లు పిలిచేవారని, ఇ ప్పుడు తొమ్మిది జోన్లవారీగా మాత్రమే టెండర్లు పిలవడంతో తెలంగాణ కాంట్రాక్టర్లకు నష్టం వాటిల్లుతున్నదని పేర్కొన్నా రు. అధికారులు ఒక సంస్థకు, రెండు కాంట్రాక్టు ఏజెన్సీలకు లబ్ధి చేకూర్చేలా నిబంధనలు మార్చడంతో జీహెచ్ఎంసీపై ఏడాదికి రూ.5.85 కోట్ల అదనపు భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. టెండర్లను వెంటనే రద్దు చేసి, గతంలో మాదిరిగా వార్డులవారీగా టెండ ర్లు పిలిస్తే 150 మంది స్థానిక కాంట్రాక్టర్లకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. మున్సిపల్ శాఖను స్వయంగా పర్యవేక్షిస్తున్న సీఎం రేవంత్ అక్రమాలపై దృష్టి సారించాలన్నారు.

జాగృతికి అనుబంధంగా యూపీఎఫ్

తెలంగాణ జాగృతి అనుబంధ సంస్థగా యునైటెడ్ పూలే ఫ్రంట్ (యూపీఎఫ్) పని చేస్తుందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. ఆదివారం తెలంగాణ జాగృతి కార్యాలయంలో యూపీఎఫ్ నాయకులతో కవిత సమావేశమయ్యారు. ఆ సంఘం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. యూపీఎఫ్ కన్వీనర్‌గా బొల్లా శివశంకర్, కోఆర్డినేటర్‌గా ఆలకుంట హరి, అడ్వైజర్‌గా గట్టు రామచందర్‌రావును నియమించారు. వారితోపాటు మరో 50 మందిని కో కన్వీనర్లుగా నియమించారు. తెలంగాణ జాగృతి, యూపీఎఫ్ ఐక్య పోరాటాలతో కాంగ్రెస్ ప్రభుత్వం దిగివచ్చి బీసీలకు స్థానిక సంస్థల్లో, విద్య, ఉద్యోగాల్లో 42% రిజర్వేషన్లు కల్పిస్తూ వేర్వేరు బిల్లులు ప్రవేశపెట్టిందని కవిత పేర్కొన్నారు.

బీసీలను ఒక తాటిపైకి తీసుకొస్తాం

బీసీలను ఒకతాటిపైకి తీసుకొచ్చి రిజర్వేషన్లు సాధించి తీరుతామని యూపీఎఫ్ నూతన కన్వీనర్ శివశంకర్ పేర్కొన్నారు. కాగా, యూపీఎఫ్ కో కన్వీనర్లుగా ఆర్‌వీ మహేందర్, కోల శ్రీనివాస్, నరహరి, విజయేంద్రసాగర్, మల్లేశ్‌గౌడ్, గొరిగే నరసింహ, గోవర్ధన్‌యాదవ్, గుర్రం శ్రవణ్, టీ నరేశ్‌కుమార్, డీ కుమారస్వామి, ఏతరి మారయ్య, కే ప్రవీణ్, రాచమల్ల బాలకృష్ణ, మురళీకృష్ణ, సల్వాచారి, ఫరూక్, కే శ్రీనివాస్, ప్రవంత్, రాజు, నాగరాజు, అఖిల్, పరమేశ్వరి, కే వెంకటేశ్, అశోక్‌రెడ్డి, మాధవ్, మేన గోపీ, జహంగీర్ పాషా, లక్ష్మణ్, నరసింహులు, వీ యాదగిరిరావు, లక్ష్మీనారాయణ, సత్యనారాయణ, గుంటి మంజుల, గీతగౌడ్, రమాదేవి, నిమ్మల నగేశ్, కృష్ణమాచారి, తారాసింగ్, శైల, పర్వతాలు, కృష్ణ, టీ కలపూర్ణ, శ్రీనివాస్, ఆంజనేయులు, షేక్ లతీఫా, సర్సింహ రాజు, గాదె సామయ్య, శివాజీ, చత్రి మంజులసాగర్, జే లలితాజగన్‌ను నియమించినట్టు కవిత ప్రకటించారు.

కేసీఆర్ కల.. సాకారమైన వేళ

మంథని డివిజన్‌లో పెద్దఎత్తున కోతకు వచ్చిన ఆయిల్‌పామ్ ● బీఆర్ఎస్ ప్రభుత్వ సహకారాన్ని గుర్తుచేసుకుంటున్న రైతులు

మంథని, జూన్ 1: రైతుల ఆర్థిక స్వావలంబనే ధ్యేయంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ఐదేండ్ల కింద బీఆర్ఎస్ ప్రభుత్వం రాయితీ, ప్రోత్సాహం అందిస్తూ విరివిగా ప్రోత్సహించిన ఆయిల్‌పామ్ పంటలు కోతకొస్తున్నాయి. పెద్ద గెలలతో కనిపిస్తున్న తోటలను చూస్తూ రైతన్నలు మురిసిపోతున్నారు. పెద్దపల్లి జిల్లా మంథని డివిజన్‌లోని నాలుగు మండలాల పరిధిలోని వివిధ గ్రామాల్లో రైతులు 1,040 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేశారు. వారం రోజుల్లో పంట కోత ప్రారంభిస్తామని ఉద్యానశాఖ అధికారులు తెలిపారు. ప్రభుత్వం ఆయిల్‌పామ్ పంట టన్నుకు రూ.21వేల ధర నిర్ణయించింది. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు కల్పించిందని, నేడు ఫలాలు అందుతున్నాయని రైతులు చెప్తున్నారు. ఒక్కో ఎకరానికి రూ.52,260 చొప్పున కేసీఆర్ ప్రభుత్వం ఖర్చు చేసిందని, రూ.4,200ల చొప్పున నాలుగేండ్లపాటు సాయం అందించిందని తెలిపారు. ముందుచూపుతో పంట వేసిన తమకు 25 ఏండ్లపాటు దిగుబడి వస్తూనే ఉంటుందని సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

వారంలో పంట కట్ చేస్తాం

ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్‌లోని రైతు నాంసాని సమ్మయ్యకు చెందిన ఐదు ఎకరాల్లో ఆయిల్‌పామ్ కోతకు వచ్చింది. మంథని, రామగుండం డివిజన్‌లో 1,250 ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంటలను సాగు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. ఆసక్తి గల రైతులు పట్టా పాసుపుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా పాసుపుస్తకాలతోపాటు ఎకరానికి రూ.1,140 డీడీ చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి.

- జ్యోతి, ఉద్యానవనశాఖ రామగుండం డివిజన్ అధికారి

అందాల భామలను చూసేందుకే టైముందా రేవంత్?

మార్కెట్లో వడ్లు ఎందుకు కొంటలేరో చూసే సమయం ముఖ్యమంత్రికి లేదా? : హరీశ్

- ప్రభుత్వ తీరుతో రాష్ట్రానికి చెడ్డపేరు
- విందు, వినోదాల కోసమే అందాల పోటీలు
- సన్నవడ్లకు 1100 కోట్ల బోనస్ బాకీ
- తుగ్లక్ పాలనతో పెట్టుబడులు శూన్యం
- దేవుళ్లపై ఒట్టేసి మాట తప్పిన ఘనుడు ముఖ్యమంత్రి రేవంత్
- మార్పు పేరుతో రాష్ట్రం ఆగమాగం
- మాజీమంత్రి హరీశ్‌రావు ఆగ్రహం

గజ్వేల్, జూన్ 1 (నమస్తే తెలంగాణ): మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొన్న అందాల భామలను చూసేందుకు ఐదుసార్లు వెళ్లిన రేవంత్‌రెడ్డికి.. మార్కెట్లో వడ్లు ఎందుకు కొంటలేరో చూసేందుకు సమయమే దొరకలేదా? అని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల విందులు, వినోదాల కోసమే అందాల పోటీలు పెట్టారా? అని నిలదీశారు. డబ్బులే వంటున్న రేవంత్‌రెడ్డి అందాల పోటీల కోసం రూ.200 కోట్లు ఖర్చు చేయడం వల్ల ఎవరికైనా కడుపు నిండిందా? అని ప్రశ్నించారు. ఇంగ్లండ్ సుందరితో రేవంత్ సన్నిహితులు అనుచితంగా ప్రవర్తించి దేశ, రాష్ట్ర గౌరవాన్ని దెబ్బతీశారని మండిపడ్డారు. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం తీగుల్‌లో ఆదివారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయ భవనం, తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ, పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వానకాలంలో జనుము, జీలుగ విత్తనాలు ఇవ్వడం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చేతకావడం లేదని, ఎక్కడా విత్తనాలు దొరకడం లేదని, వాటి ధర డబుల్ చేసిన చేతకాని దద్దమ్మ ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్నదని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో జీలుగ విత్తనాలు 1,100 ఉంటే, రేవంత్ ప్రభుత్వం ఆ ధరను రూ. 2,200 చేసిందని విమర్శించారు. తరుగు పేరుతో ఐదు నుంచి పది కిలోలు కోతపెడుతున్నారని, సన్నవడ్లకు రూ.1,100 కోట్లు బాకీ పడిన ప్రభుత్వం ఆ డబ్బులను ఎగబెడుతుందేమోనన్న అనుమానం వ్యక్తంచేశారు. రైతులకు విత్తనాలు ఇవ్వలేని సీఎం పదవిలో ఉండటం అవసరమా? అని ప్రశ్నించారు.

సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం తీగుల్‌లో బీఆర్ఎస్ జెండావిష్కరణలో పాల్గొన్న హరీశ్‌రావు, చిత్రంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి, రాధాకృష్ణశర్మ

ఉద్యోగాలేవీ?

అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరమే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి 10 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని విమర్శించా రు. కేసీఆర్ నోటిఫికేషన్లు ఇచ్చి, పరీక్షలు నిర్వహించిన 1.67 లక్షల ఉద్యోగాలను రేవంత్ ఇచ్చారని దుయ్యబట్టారు. గురుకుల విద్యార్థులకు కేసీఆర్ కడుపు నిండా అన్నం పెట్టి చదువు చెప్పించారని, కానీ రేవంత్ ప్రభుత్వంలో 60-70 మంది విద్యార్థులు చనిపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. మూసీ సుందరీకరణను మధ్యలోనే ఆపేశారని, హెచ్‌సీయూపై సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసిందని పేర్కొన్నారు. తుగ్లక్ పాలనలో పెట్టుబడులు పెట్టేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని వివరించారు. తెలంగాణకు పూర్వ వైభవం రావాలంటే కేసీఆర్ మళ్లీ రావాలని కోరారు.

> బోనస్‌ను బోగస్ చేశారు. కొనుగోలు చేసిన వడ్లకు సకాలంలో డబ్బులు పడటం లేదు. ఎరువులు, విత్తనాల కోసం రైతులు ధర్నాలు చేయాల్సిన పరిస్థితి వచ్చింది. రైతులకు విత్తనాలు ఇవ్వలేని ముఖ్యమంత్రి పదవిలో ఉండటం అవసరమా? –హరీశ్‌రావు

పథకాలన్నీ మాయం

కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు కరెంట్, నీళ్లు బంగారంలా వస్తుండేవని, సర్కారు దవాఖానకు పోతే కాన్పు చేసి కేసీఆర్ కిట్ ఇచ్చి తల్లీబిడ్డను ఇంటి దగ్గర దిగబెట్టేవారని హరీశ్‌రావు గుర్తుచేశారు. రేవంత్ రాకతో అవన్నీ బందయ్యాయని అన్నారు. దేవుడి మీద ఒట్టేసి మాటతప్పిన ఘనుడు రేవంత్‌రెడ్డి అని దుయ్యబట్టారు. కాంగ్రెస్ నిజ స్వరూపం సాధారణంగా మూడు నాలుగేండ్లకు బయటపడతదని, కానీ మూడు, నాలుగు నెలలకే రేవంత్ బండారం బయటపడిందన్నారు. రెండు దశాబ్దాలుగా ప్రభుత్వ పాఠశాలలో ఉచితంగా విద్యాబోధన చేస్తున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు బాల్‌రెడ్డిని సన్మానించిన హరీశ్‌రావు ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వెళ్లి తిరిగి వస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వర్గల్ మండలం తునికిమక్తా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త చాకలి కనకయ్య కుటుంబాన్ని పరామర్శించి, రూ. 5 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్, డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి, బట్టు సుధాకర్‌రెడ్డి, మర్కూక్ కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

హరీశ్‌రావు విమర్శించారు. తెలంగాణ తల్లి ఉద్యమానికి స్ఫూర్తి అని, ఆ తల్లి దీవెనతోనే తెలంగాణ సాధించుకున్నామని చెప్పారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయడం అసాధ్యమని అన్నారు. రైతుబంధు, కల్యాణలక్ష్మి బంద్ చేస్తావా? మెడికల్ కాలేజీలు మూరుస్తావా? సచివాలయం, 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం తీసేస్తావా? అని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు.

మార్పు మార్పు అని చెప్పిన రేవంత్‌రెడ్డి తెలంగాణ తల్లిలో మార్పు తీసుకొచ్చారని

నకిలీ పత్తివిత్తనాలు పట్టివేత

మరికల్, జూన్ 1 : నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలో అక్రమంగా నిల్వ చేసిన నకిలీ పత్తి విత్తనాలను ఆదివారం జిల్లా టాస్క్‌ఫోర్స్, మరికల్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై రాము తెలిపిన వివరాల ప్రకారం.. మరికల్‌కు చెందిన జీ శ్రీనివాసులు, ధన్వాడ మండలం హన్మాన్ పల్లికి చెందిన వెంకటయ్య మరికల్‌లోని కుమ్మరివాడలోని ఒక ఇంట్లో 100 కిలోల నకిలీ పత్తి విత్తనాలు ఉంచి రైతులకు విక్రయిస్తున్నారని సమాచారం వచ్చింది. దీంతో జిల్లా టాస్క్‌ఫోర్స్, మరికల్ పోలీసుల ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. ఏవో రెహమన్‌ఖాన్ ఫిర్యాదు మేరకు శ్రీనివాసులు, వెంకటయ్యపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై వెల్లడించారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రైతులకు కష్టాలు

- కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై మూడునెలలవుతున్నా ఇంకా రోడ్లపై ధాన్యపు రాసులే దర్శనం
- తడిసి మొలకెత్తుతున్న ధాన్యం
- షరతులు లేకుండా సర్కారే కొనాలి
- మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్, జూన్ 1 : ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రైతులకు కష్టాలు మొదలయ్యాయని, కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి మూడు నెలలు కావస్తున్నా పూర్తిస్థాయిలో వడ్లు కొనుగోలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం పడగల్ గ్రామంలో రోడ్లపై వర్షాలకు తడిసి మొలకలు వచ్చిన ధాన్యాన్ని అక్కడి రైతులతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వేముల మాట్లాడుతూ.. రేవంత్ ప్రభుత్వం సకాలంలో వడ్లు కొనుగోలు చేయకపోవడంతో కల్లాలు, రోడ్లపై వడ్లు అలాగే ఉండటంతో అకాల వర్షాలకు తడిసి మొలకలు రావడంతో పనికి రాకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని అటు ప్రభుత్వం ఇటు వ్యాపారులు కొనుగోలు చేయకపోవడంతో కిలో నాలుగైదు రూపాయలకు విక్రయించుకుంటున్నారని తెలిపారు. అందాల పోటీల కోసం ఎనిమిదిసార్లు అధికారులతో సమీక్ష చేసిన సీఎం రేవంత్‌కు.. పంటల కొనుగోలుపై సమీక్ష చేసే సమయం లేదా అని ప్రశ్నించారు. తడిసిన, మొలకలు వచ్చిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా పూర్తిగా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారమే కొనుగోలుకు చివరిరోజు అని అధికారులు అంటున్నారని పలువురు రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వేముల వెంటనే కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి పడగల్‌లోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మరో నాలుగు రోజులు కొనసాగించి పూర్తి ధాన్యం కొనుగోలు అయ్యేలా చూడాలని కోరారు. సోమవారం నుంచి వడ్లు కొనుగోలుచేయబోమంటూ రైతులను ఆందోళనకు గురిచేస్తున్న ఐకేపీ అధికారిని ఎమ్మెల్యే మందలించారు.

కోడెల మృతి కారకులపై

క్రిమినల్ చర్యలు తీసుకోవాలి

- ఆదాయం మీదనే ప్రభుత్వానికి, ఆలయ అధికారులకు శ్రద్ధ
- మూగ జీవాలు పిట్టల్లా రాలుతున్నా వారికి కనీస మానవత్వం లేదు
- బీఆర్ఎస్ నేత చల్మెడ లక్ష్మీనరసింహారావు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు

వేములవాడ, జూన్ 1: రాజన్న ఆలయ గోశాల నిర్వహణలో నిర్లక్ష్యం వహించడంతోనే కోడెలు పిట్టల్లా రాలిపోయాయని, ఇందుకు కారణమైన అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు డిమాండ్ చేశారు. ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడ చీమ చిటుక్కుమన్నా మాట్లాడే స్థానిక ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్ కోడెల మృత్యువాత పడుతున్నా ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. ఆరు నెలల క్రితం మంత్రి కొండా సురేఖ సిఫారసు లేఖతో ఒకరికి 60 కోడెలు కేటాయించడం వివాదాస్పదంగా మారి ఈ పంపిణీ ఆగిపోవడంతో 500 కోడెలను ఉంచే తిప్పాపూర్ గోశాలలో 1200కు పైగా ఉంచారని పేర్కొన్నారు. దీంతో కోడెలు అనారోగ్యం బారిన పడి సరైన ఆహారం అందక మృత్యువాత పడుతున్నాయని పశు వైద్యాధికారులే నిర్ధారించడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తంచేశారు. గడిచిన మూడు రోజుల్లో తిప్పాపూర్ గోశాలలో 18 కోడెలు మృతి చెందాయని తెలిపారు. ఆహారం లేక కోడెలు మృతి చెందితే అధికారులు, నాయకులకు కనీస మానవత్వంలేదని మండిపడ్డారు.

అభ్యుదయ రైతులకు మేలు రకపు విత్తనాలు

నేడు 40వేల మందికి పంపిణీ

మంత్రి తుమ్మల వెల్లడి

హైదరాబాద్, జూన్ 1(నమస్తే తెలంగాణ): విత్తన స్వయం సంవృద్ధి లక్ష్యంగా ప్రతి గ్రామంలో అభ్యుదయ రైతులను గుర్తించి వారికి మేలు రకపు విత్తనాలు అందించాలని వ్యవసాయ శాఖ నిర్ణయించింది. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా 40వేల మంది రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్నట్టు మంత్రి తుమ్మల వెల్లడించారు. ఎంపిక చేసిన అభ్యుదయ రైతులకు ఐదు ప్రధాన పంటలకు సంబంధించిన (వరి, కంది, పెసర, మినుము మరియు జొన్న) విత్తనాలు 11వేల గ్రామాల్లో 40వేల మందికి పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ఈ విత్తనాల ఖర్చును రైతుల నుంచే వసూలు చేస్తారని తెలిసింది.

పాలకుర్తిలోని రాజీవ్‌చౌరస్తాలో బీఆర్ఎస్ శ్రేణులను అడ్డుకుంటున్న పోలీసులు

పాలకుర్తిలో మళ్లీ ఉద్రిక్తత

- రాజుకున్న తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్ఠ వివాదం
- ఎర్రబెల్లి ఉషా దయాకర్‌రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నిరసన
- నేతలను అడ్డగించిన పోలీసులు
- ప్రతిఘటించిన బీఆర్ఎస్ నేతలు
- నాయకుల ముందస్తు అరెస్టు

ఉషా దయాకర్‌రావు

పాలకుర్తి, జూన్ 1: జనగాం జిల్లా పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో ఆదివారం కూడా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీఆర్ఎస్ నిర్మించిన తెలంగాణ తల్లి గద్దె విషయంలో కాంగ్రెస్ దౌర్జన్యానికి దిగింది. పోలీసుల అండతో కాంగ్రెస్ నాయకులు గూండాయిజం చేస్తూ రాత్రికి రాత్రే గద్దె నిర్మించి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ప్రతిగా బీఆర్ఎస్ శ్రేణులు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సతీమణి ఉషా దయాకర్‌రావు ఆధ్వర్యంలో నిరసనకు దిగారు. ర్యాలీగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్తుండగా, వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య ఆధ్వర్యంలో రాజీవ్ చౌరస్తాలో బీఆర్ఎస్ శ్రేణులను అడ్డుకున్నారు. దీంతో బీఆర్ఎస్ శ్రేణులు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుని తోపులాట జరిగింది. ఉషా దయాకర్‌రావు కొంత ఆస్వస్థతకు గురయ్యారు. నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్ఎస్ నేతలను ముందస్తు అరెస్టు చేయడంపై ఉషా దయాకర్‌రావు అభ్యంతరం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేయాలని ఎర్రబెల్లి ఉషా దయాకర్‌రావు డిమాండ్ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో ఝాన్సీరెడ్డిపై ఫిర్యాదు చేసిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. విదేశీయురాలైన ఝాన్సీరెడ్డికి భారత పౌరసత్వం ఉన్నదా? అని ప్రశ్నించారు.

692మందికి పోలీసు సేవా పతకాలు

- రాష్ట్ర అవతరణ దే సందర్భంగా హోంశాఖలో పలు పతకాలు
- శౌర్య పతకానికి 11మందిని ఎంపికచేసిన రాష్ట్ర ప్రభుత్వం

మీర్జా కరమతుల్లా బేగ్

హైదరాబాద్, జూన్ 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర హోంశాఖలోని పోలీసు, ఏసీబీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, టీఎస్‌పీఎఫ్, అగ్నిమాపక విభాగాల్లో మొత్తం 692 పోలీసు సేవా పతకాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ప్రకటించింది. పోలీసుశాఖలో 9మందికి, అగ్నిమాపకశాఖలో ఇద్దరి కలిపి మొత్తం 11మందిని శౌర్య పతకాలకు ఎంపిక చేసింది. మరో 19మందికి మహోన్నత సేవా పతకాలు ఇవ్వనున్నట్టు పేర్కొన్నది. శౌర్యపతకం పొందిన 11మందికి ప్రతీనెలా వారి వేతనంలో రూ.500 ఇంక్రిమెంట్ కలువనున్నది. శౌర్యపతకం పొందిన వారిలో గ్రేహౌండ్స్ నుంచే 9మంది ఉన్నారు. మొత్తం పోలీసుశాఖకు 625, ఏసీబీకి 22, విజిలెన్స్‌కు 6, అగ్నిమాపకశాఖకు 20, తెలంగాణ స్టేట్ స్పెషల్ ప్రొటక్షన్ ఫోర్స్ (టీఎస్‌పీఎఫ్) 29 పతకాలు వచ్చాయి.

శౌర్యపతకం పొందిన వారిలో..

1) సీహెచ్ మహేశ్, ఏఎస్‌సీ-ఆర్ఎస్ఐ టీజీఎస్పీ అండ్ గ్రేహౌండ్స్
2) జీ శోభన్, ఏఎస్‌సీ-ఆర్ఎస్ఐ టీజీఎస్పీ అండ్ గ్రేహౌండ్స్
3) ఏ రాకేశ్‌కుమార్, ఏఎస్‌సీ-ఆర్ఎస్ఐ గ్రేహౌండ్స్
4) జీ వెంకటేశ్, పీసీ-2533, టీజీఎస్పీ అండ్ గ్రేహౌండ్స్
5) కే రమేశ్, పీసీ-1266, టీజీఎస్పీ అండ్ గ్రేహౌండ్స్
6) పపియానాయక్, పీసీ-375, టీజీఎస్పీ అండ్ గ్రేహౌండ్స్
7) ఎం రవీందర్ సంజయ్, పీసీ-1192, టీజీఎస్పీ అండ్ గ్రేహౌండ్స్
8) జే నరేశ్, పీసీ-1177, టీజీఎస్పీ అండ్ గ్రేహౌండ్స్
9) టీ వెంకటేశ్, పీసీ-1285, టీజీఎస్పీ అండ్ గ్రేహౌండ్స్

అగ్నిమాపకశాఖ..

1) టీ వెంకన్న, డీఎఫ్‌వో, హైదరాబాద్ జిల్లా
2) మీర్జా కరమతుల్లా బేగ్, లీడింగ్ ఫైర్‌మెన్, సాలర్‌జంగ్ మ్యూజియం ఫైర్‌స్టేషన్

టీ వెంకన్న, డీఎఫ్‌వో

పోలీసు సేవా పతకాలు-2025, విభాగాల వారీగా..

పతకాలు	పోలీసు	ఏసీబీ	విజిలెన్స్	అగ్నిమాపకశాఖ	టీఎస్‌పీఎఫ్
శౌర్య పతకం	9	-	-	2	-
మహోన్నత సేవా పతకం	16	1	-	1	3
ఉత్తమ సేవా పతకం	92	4	1	3	3
కఠిన సేవా పతకం	47	-	-	-	-
సేవా పతకం	461	17	5	14	15

అంబేద్కర్ వర్సిటీకి ఏపీ బాకీ 600 కోట్లు!

- ఏపీ నుంచి బకాయిల వసూలులో సర్కారు నిర్లక్ష్యం
- రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై విద్యావేత్తలు, విద్యార్థుల విమర్శలు
- ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు అడ్మిషన్లు నిలిపివేసిన వర్సిటీ

హైదరాబాద్, జూన్ 1 (నమస్తే తెలంగాణ): బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయానికి ఏపీ సర్కారు మొండిచేయి చూపినట్టే కనిపిస్తున్నది. వర్సిటీకి బకాయి పడ్డ రూ.600 కోట్లు చెల్లించడం అనుమానమేనని విద్యావేత్తలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఏపీ నుంచి నిధులు రాబట్టే విషయంలో తెలంగాణలోని కాంగ్రెస్ సర్కారు మౌనం వహించడమే ఇందుకు కారణమని విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో తెలంగాణ తీవ్రంగా నష్టపోతున్నదని అధికారులు చెప్తున్నారు. అంబేద్కర్ వర్సిటీని ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని 10వ షెడ్యూల్‌లో చేర్చారు. చట్టం ప్రకారం పదేండ్ల పాటు తెలంగాణ ప్రభుత్వం 48శాతం, ఏపీ సర్కారు 52శాతం నిధులను వర్సిటీకి కేటాయించాలి. కానీ